క్లుప్తంగా

వాల్మీకి మహర్షికి ఘననివాళి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చిట్టినగర్ పరిధిలోని ఆయా ప్రాంతాల్లో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. భీమనవారి పేటలోని వాల్మీకి భవన్‌లో విజయవాడ వాల్మీకి(బోయ) సేవా సంఘం ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు ఉపకార వేతనాలను పంపిణీ చేశారు. సేవా సంఘ అధ్యక్షులు నరసింహారావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ 84మంది పేద విద్యార్థులకు ఉపకార వేతనాలను అందచేశారు. కార్యక్రమంలో దుర్గగుడి పాలకమండలి సభ్యులు అవ్వారు బుల్లాబ్బాయ్, బీజేపీ నాయకులు శివకుమార్ పట్నాయక్, సేవా సంఘ ఉపాధ్యక్షులు ఎం. కృష్ణమూర్తి, సాంబశివరావు, ప్రసాద్ ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో...
కేఎల్‌రావు పార్కు రోడ్డు వద్ద బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో అవ్వారు బుల్లాబ్బాయ్, శివకుమార్ పట్నాయక్ వాల్మీకి జయంతి వేడుకలను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు అడ్డూరి శ్రీరామ్ హాజరై వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పల్లపరాజు, హరిప్రసాద్, శివ లలిత, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

వీఎంసీ వార్డు సచివాలయాల ఉద్యోగుల జేఏసీ ఎన్నిక



పాయకాపురం(విజయవాడరూరల్): విజయవాడ నగరపాలక సంస్థలో పని చేస్తున్న గ్రామ వార్డు సచివాలయ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీని ఎన్నుకున్నట్లు ఏపీ రాష్ట్ర విద్యా కార్యాచరణ కమిటీ చైర్మన్ బి.ఘంటయ్య మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్‌గా కొమ్ముకూరి జైకర్(వార్డ్ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ సెక్రటరీ), జనరల్ సెక్రటరీగా శ్రీకాంత్(ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ), కన్వీనర్‌గా కొప్పుల ఫణీంద్ర ఎన్నికయ్యారు. బ్యాలెట్ విధానం ద్వారా ఎన్నుకున్నామని చెప్పారు. ఈ ఎన్నికల్లో 1,400 మంది సచివాలయ ఉద్యోగులు పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకుని ఐక్యమత్యాన్ని చాటారన్నారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించే దిశగా నూతన కమిటీ పని చేస్తుందని చెప్పారు. ఎన్నికల కార్యక్రమంలో ఏపీ ఎంఎస్‌కే అధ్యక్షురాలు సుంకర మహాలక్ష్మి, ఏపీ వీఎస్‌డబ్ల్యూఎస్ జేఏసీ కో చైర్మన్ సుభానీ తదితరులు పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా రసభారతి సాహితీ సంస్థ కార్యవర్గం ఎన్నిక

మధురానగర్(విజయవాడసెంట్రల్): నగరంలో 40 ఏళ్లుగా శతావధానం, అష్టావధానం, కవి సమ్మేళనం, భువన విజయం వంటి విశిష్టమైన సాహితీ కార్యక్రమాలు నిర్వహిస్తున్న రసభారతి సంస్థ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముత్యాలంపాడు మారుతీ గ్యాస్ కంపెనీ వద్ద రసభారతి సాహితీ సంస్థ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతన కమిటీ అధ్యక్షుడిగా పొన్నలూరి లక్ష్మణరావు, ఉపాధ్యక్షుడు కుందా రామనారాయణ, ప్రధాన కార్యదర్శి డాక్టర్ జంధ్యాల పరదేశి బాబు, సహాయ కార్యదర్శి జే కృష్ణమోహన్, కోశాధికారి చెట్లపల్లి మారుతీప్రసన్నలతో పాటు కార్యవర్గ సభ్యులుగా పింగళి కృష్ణారావు, కె.లక్ష్మణరావు, ఆర్.నాగభూషణ శాస్త్రి, శిష్ట్లు వరప్రసాద్, డాక్టర్ పాలపర్తి శ్యామలానందప్రసాద్, డాక్టర్ పీవీఎన్ కృష్ణ, ఏ.మల్లికార్జున శర్మ, ప్రసూనారామన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీ అధ్యక్ష, కోశాధికారి పొన్నలూరి లక్ష్మణరావు, చెట్లపల్లి మారుతీప్రసన్న మాట్లాడుతూ రసభారతి సాహితీ సంస్థ ఆధ్వర్యంలో మరిన్ని సాహితీ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అనంతరం నిర్వహించిన కవి సమ్మేళనం ఆహుతులను అలరించింది. కవులు, కవయిత్రులు వారి కవితలను వినిపించారు.

వ్యర్థాలను వేరు చేసి సేకరించాలి

పటమట(విజయవాడతూర్పు): నగరంలో ప్రతి రోజు ఇంటింటి చెత్త సేకరణను తడి, పొడి చెత్తగా వేర్వేరుగా సేకరించాలని, వర్షపు నీటి నిల్వలు రోడ్డుపైన ఉండకూడదని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. నగర పర్యటనలో భాగంగా ఆయన మంగళవారం లబ్బీపేట వాటర్ ట్యాంక్ రోడ్డు, విశాలాంధ్ర రోడ్డు, బీఆర్టీఎస్ రోడ్డు, ఎస్ఆర్పీ రోడ్డు, శివాలయం వీధి, భగత్ సింగ్ రోడ్డు, చల్లపల్లి వారి వీధి, కేదారేశ్వరపేట, రామలింగేశ్వరపేట, లోటస్ ల్యాండ్‌మార్క్, సీకే రెడ్డి రోడ్డు, బుడమేరు వంతెన, దేవీనగర్ మెయిన్ రోడ్డు, మధురానగర్ ఆర్ఓబీ, అయోధ్య నగర్ ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ఇంటి వద్దనే వ్యర్థాలను తడి, పొడిగా వేరు చేసి సేకరించాలని, వర్షపు నీటి నిల్వలను ఎక్కడ ఉంచరాదన్నారు. ఎప్పటికప్పుడు మాన్సూన్ రెస్పాన్స్ టీం(ఎంఆర్‌టీ) అప్రమత్తంగా ఉంటూ నిల్వలను వాహనాల సహాయంతో తోడించాలని ఆదేశించారు. నగరంలో దోమలను నిర్మూలించేందుకు యాంటీ లార్వా ఆపరేషన్లు నిర్వహిస్తూ ప్రజలకు దోమల వల్ల అనారోగ్య సమస్యలు రానివ్వకూడదని కమిషనర్ చెప్పారు.

అధ్వానంగా కేదారేశ్వరపేట పార్కు నిర్వహణ

- పనిచేయని ఆటవస్తువులు
- సంచరిస్తున్న పశువులు
- తరచూ గంజాయి బ్యాచ్ గొడవలు
- పట్టించుకోని వీఎంసీ అధికారులు
- ఆందోళనలో స్థానికులు



పార్కు చుట్టూ ఆరేసిన దుస్తులు



పార్కులో విరిగిపోయిన పిల్లల ఆటపరికరాలు



పార్కులో చేరిన పశువులు

పూర్ణానందంపేట(విజయవాడపశ్చిమ): కేదారేశ్వరపేట ఎర్రకట్ట వద్ద లక్షలాది రూపాయలు ఖర్చుచేసి నిర్మించిన పార్కు నిర్వహణలో వీఎంసీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో పార్కు నిరుపయోగంగా మారింది. పార్కులోని ఆటవస్తువులు, పరికరాలు తప్పుపట్టిపోయి పనికి రాకుండా పోగా, గతంలో ఆడుకునే క్రమంలో పలువురు చిన్నారులు గాయపడినట్లు తల్లిదండ్రులు చెబుతుండటం గమనార్హం.

మహిళలు అడుగుపెట్టలేని పరిస్థితి..
నిరుపయోగంగా మారిన పార్కును గంజాయి బ్యాచ్ అడ్డాగా చేసుకున్నట్లు సమాచారం. కొందరు యువకులు ఈ పార్కులో గంజాయి, మద్యం సేవిస్తున్నప్పటికీ పార్కు నిర్వాహకులు పట్టించుకోవడం లేదని స్థానిక మహిళలు చెబుతున్నారు. చుట్టుపక్కల ఉన్న కళాశాలు, పాఠశాలలకు చెందిన విద్యార్థులు సైతం ఈ గంజాయి బ్యాచ్ ప్రభావానికి ఎక్కడ లోనవుతారోనని తల్లిదండ్రులు ఆందోళనచెందుతున్నారు. పగటిపూటే గంజాయి బ్యాచ్ పార్కులోని పిల్లల ఆటపరికరాలపై తిష్టవేసి గంజాయి సేవిస్తూ, ఒకరిపైమరొకరు దాడులు చేసుకుంటున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఈక్రమంలో గంజాయి బ్యాచ్ ఆగడాలపై అభ్యంతరం తెలిపినవారిపై కూడా వారు దాడులు చేస్తున్నారని సమాచారం. దీంతో పార్కులో అడుగు పెట్టాలంటేనే భయపడాల్సి వస్తోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పార్కులోనే దుస్తులు ఆరవేత...
పార్కుకు ఉన్న గేటుకు తాళాలు వేయకపోవడంతో పశువులు సైతం పార్కులోకి చేరి పచ్చటి మొక్కలను సైతం తినేస్తున్నాయి. నిరుపయోగంగా మారిన పార్కులోని మెస్‌లు, ఆటవస్తువులపై చుట్టుపక్కలవారు తమ దుస్తులు ఆరేసుకుంటున్నారు. దీంతో పార్కులో పచ్చదనం కొరవడింది. ఇప్పటికైనా నగరపాలకసంస్థ అధికారులు స్పందించి పార్కు చిన్నారులు ఆడుకునేందుకు వీలుగా పరికరాలు ఏర్పాటు చేయడంతోపాటు గంజాయి బ్యాచ్ ఆగడాలను అరికట్టేందుకు తగిన చర్యలు తీసుకోవాలని నగరవాసులు స్థానికులు కోరుతున్నారు.

జేబులు నింపుకొనేందుకే విజయవాడ ఉత్సవ్

- రాజకీయాల్లో దేవినేని అంటే ఓ బ్రాండ్
- రియల్ ఎస్టేట్‌లో ప్రజలను మోసం చేసి అమెరికా పారిపోయింది ఎవరో తెలుసు
- వైఎస్సార్ సీపీ ఫ్లోర్‌లీడర్, కార్పొరేటర్లు



మాట్లాడుతున్న ఫ్లోర్ లీడర్ వెంకట సత్యనారాయణ, డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, కార్పొరేటర్లు

లబ్బీపేట(విజయవాడతూర్పు): నాలుగున్నర దశాబ్దాలుగా రాజకీయాల్లో ఉంటూ సేవ చేయడంలో దేవినేని కుటుంబానికి మంచి పేరుందని నగరపాలక సంస్థ వైఎస్సార్ సీపీ ఫ్లోర్ లీడర్ వెంకట సత్యనారాయణ అన్నారు. నాసిరకం వ్యాపారాలు, రియల్ ఎస్టేట్‌లో మోసాలు చేసి అమెరికా పారిపోయిన ఎంపీ కేశినేని చిన్ని రాజకీయ లబ్ధికోసం దేవినేని కుటుంబంపై ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. విజయవాడలోని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో వెంకట సత్యనారాయణ మాట్లాడుతూ.. కేశినేని చిన్ని రాజకీయంగా విజయవాడ నగర ప్రజలకు కానీ పార్టీకి కానీ తెలియదని, కేవలం కేశినేని నాని తమ్ముడిగానే అందరికీ తెలుసునన్నారు. తమ్ముడిగా నిన్ను అన్ని విధాలుగా చేరదీసిన అన్నకే వెన్నుపోటు పొడిచావన్నారు. నగరంలో దేవినేని కుటుంబం కబ్జా చేశారని నువ్వు నిరూపించగలవా అని సవాల్ విసిరారు. ఉత్సవాలను అడ్డుపెట్టుకుని నీచమైన రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ రాష్ట్రంలో దేవినేని కుటుంబం జోలికి వచ్చే ధైర్యం ఎవరికీ లేదన్నారు. దేవినేని అవినాష్, వెలంపల్లి శ్రీనివాసరావు, పేర్ని నానిలకు ఉన్న రాజకీయ అనుభవం చిన్నికి లేదని ఎద్దేవా చేశారు.

ఎంపీ లాభం కోసమే విజయవాడ ఉత్సవ్..
విజయవాడ ఉత్సవ్ కేవలం ఎంపీ కేశినేని చిన్ని లాభం కోసమే నిర్వహించారని డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ ఆరోపించారు. ఐదు సార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా చేసిన నెహ్రూ గురించి మాట్లాడే అర్హత కేశినేని చిన్నికి లేదన్నారు. దేవినేని అవినాష్ దమ్ముగా రూ.650 కోట్లతో అభివృద్ధి పనులు చేసి చూపించారన్నారు. చిన్ని జేబులు నింపుకోవడమే కానీ, ప్రజలకు చేసింది ఏమీ లేదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి తంగిరాల రామిరెడ్డి, కార్పొరేటర్లు వియ్యపు అమర్నాథ్, అంబడిపూడి నిర్మలకుమారి, కలపాల అంబేడ్కర్, రెహానా నాహీద్, తాటిపర్తి కొండారెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ అలీం పాల్గొన్నారు.

కౌన్సిల్ అజెండాపై మేయర్ సమీక్ష



శాఖాధిపతులతో సమీక్ష నిర్వహిస్తున్న మేయర్ భాగ్యలక్ష్మి

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు తాము నిరంతరం కృషి చేస్తున్నామని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆమె చాంబర్‌లో బుధవారం జరగబోయే కౌన్సిల్ సమావేశపు అజెండాపై మంగళవారం ఆమె వివిధ శాఖాధిపతులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో కౌన్సిల్ ఎజెండా, అడిషనల్ ఎజెండా ఉన్న ప్రతిపాదనలను శాఖధిపతులతో చర్చించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. నగరాభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం సభ్యులు ఇచ్చిన ప్రతిపాదనలకు అధికారులందరూ సహకరించాలన్నారు. ప్రజల కోసం విజయవాడ నగరపాలక సంస్థకు ఎల్లప్పుడూ తోడుగా ఉండాలని సూచించారు. సమావేశంలో చీఫ్ ఇంజినీర్ ఆర్.శ్రీనాథ్ రెడ్డి, చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, డెప్యూటీ కమిషనర్ రెవెన్యూ ఇన్‌చార్జి, ఎస్టేట్ ఆఫీసర్ డాక్టర్ ఎ.శ్రీధర్, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.అర్జున్ రావు, సూపరింటెండెంట్ ఇంజినీర్లు పి.సత్యకుమారి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు సురేఖ, శ్రీనివాస్ రెడ్డి, సామ్రాజ్యం, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ చక్రవర్తి, అకౌంట్స్ ఆఫీసర్ బి.సత్యనారాయణమూర్తి, స్టేట్ ఫైర్ ఆఫీసర్ నరేష్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బి.సోమశేఖర్ రెడ్డి, డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రీవెరిఫికేషన్ పేరుతో దివ్యాంగులకు వేధింపులు

బందెల కిరణ్‌రాజ్

భవానీపురం(విజయవాడపశ్చిమ): సదరం సర్టిఫికెట్ రీవెరిఫికేషన్ ప్రక్రియ పేరుతో కూటమి ప్రభుత్వం దివ్యాంగులను వేధిస్తోందని వైఎస్సార్ సీపీ నాయకుడు, దివ్యాంగుల హక్కుల సాధన సమితి జాతీయ అధ్యక్షులు బందెల కిరణ్‌రాజ్ మంగళవారం ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. దివ్యాంగులు అనేక వ్యయ ప్రయాసలతో తమ వైకల్యశాతాన్ని నిరూపించుకోవాల్సిన దుస్థితి ఏర్పడటం బాధాకరమని పేర్కొన్నారు. రీ వెరిఫికేషన్ ప్రక్రియను నిలుపుదల చేసినట్లు ప్రకటించిన రెండు నెలల్లోనే తిరిగి ఆ ప్రక్రియ చేపడుతున్నట్లు ప్రభుత్వం పేర్కొనడం దారుణమని అభిప్రాయపడ్డారు. రీ వెరిఫికేషన్ కారణంగా అర్హులు సైతం పింఛన్ కోల్పోయి దిక్కుతోచని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఇప్పటివరకు ఒక్క కొత్త పింఛన్ ఇవ్వకపోగా, ఉన్న పింఛన్లనే తొలగిస్తోందని ఆందోళన వ్యక్తంచేశారు. రీవెరిఫికేషన్‌ను నిలుపుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

విద్యుత్ స్తంభాన్ని సరిచేయించండి సారూ!



ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభం



తుప్పు పట్టి విరిగిపోయి ఉన్న స్తంభం అడుగుభాగం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): నగరంలోని 48వ డివిజన్ సాధుజాన్ వీధిలో 48-152-56 విద్యుత్ స్తంభం అడుగు భాగం తుప్పుపట్టి కూలేందుకు సిద్ధంగా ఉంది. చిన్నపాటి వర్షం సమయంలోనూ గాలులకు విద్యుత్‌స్తంభం ఊగుతుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని సాధుజాన్ వీధివాసులు భయాందోళనలకు గురవుతున్నారు. సాధుజాన్ వీధి కొండ ప్రాంతంలో నివాసం ఉండే అనేక కుటుంబాలకు ఈ రోడ్డే ప్రధానం. కొండపై భాగంలో నివాసం ఉండే కుటుంబాల వారు తమ సైకిళ్లకు ఈ స్తంభానికి గొలుసులు వేసి పెట్టుకుంటారు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు, ఈదురు గాలులకు స్తంభం అటు ఇటు ఊగుతుండటంతో స్థానికులు మరింత ఆందోళన చెందుతున్నారు. ఇకనైనా ఎటువంటి ప్రమాదం చోటుచేసుకోక మునుపే విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి నూతనస్తంభాన్ని ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

మానవతావాది ఎస్ఆర్ శంకరన్

మధురానగర్(విజయవాడసెంట్రల్): పేద ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు నిత్యం పరితపించిన గొప్ప మానవతావాది మాజీ ఐఏఎస్ అధికారి ఎస్ఆర్ శంకరన్ అని మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ కొనియాడారు. శంకరన్ వర్ధంతిని పురస్కరించుకుని విజయవాడ ఐక్యతాభవన్‌లో మంగళవారం శంకరన్ కాంస్య విగ్రహానికి జల్లి విల్సన్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల అవసరాల మేరకు ఐఏఎస్ అధికారిగా సమర్థవంతమైన సేవలు అందించటంతో పాటు..అనేక చట్టాలను రూపొందించటంలో రాజకీయనాయకులు, ముఖ్యమంత్రులను సైతం ఒప్పించగలిగారన్నారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నివారణ చట్టం, భూ సంస్కరణ, అసైన్‌మెంట్, గ్రామీణ ఉపాధి, అటవీ హక్కులు వంటి ఎన్నో చట్టాలను సమర్థవంతంగా రూపొందించి కోట్లాది మంది పేదలకు అండగా నిలిచారని కొనియాడారు. కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి బుట్టి రాయప్ప, నాయకులు సంగుల పేరయ్య, ఈదులూరి రాధాకృష్ణ, కె.స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడి మార్కెట్‌పై అవగాహన అవసరం



మాట్లాడుతున్న సెబీ సదరన్ రీజియన్ జీఎం ఎంకే శ్రీకాంత్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పెట్టుబడి మార్కెట్‌పై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని సెబీ సదరన్ రీజియన్ జనరల్ మేనేజర్ ఎంకే శ్రీకాంత్ సూచించారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ స్టడీస్ ఆధ్వర్యంలో 'ఇంట్రడక్షన్ టూ సెక్యూరిటీస్ మార్కెట్స్' అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని ఆ కళాశాల ప్రాంగణంలో మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంకే శ్రీకాంత్ మాట్లాడుతూ విద్యార్థులు పెట్టుబడులకు సంబంధించిన ప్రాథమిక అంశాలను తెలుసుకోవాలన్నారు. ఆర్థిక మార్కెట్లకు సంబంధించిన అంశాలను గమనిస్తూ పట్టు సాధించాలన్నారు. ఆయా పెట్టుబడులకు సంబంధించిన చోటుచేసుకుంటున్న మోసాలపై అవగాహన పెంచుకొని జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. భవిష్యత్‌లో పెట్టుబడిదారులుగా మారే విద్యార్థులు సరైన దిశలో ఆర్థిక అవగాహనతో అడుగులు వేస్తే మంచి లాభాలను సాధించవచ్చన్నారు. సీడీఎస్‌ఎల్ ఉపాధ్యక్షులు వీ శివప్రసాద్ మాట్లాడుతూ పలు పెట్టుబడి అంశాలపై మెలకువలను వివరించారు. కళాశాల కార్యదర్శి చిట్టా అమర్‌సుధీర్ మాట్లాడుతూ విద్యార్థులకు వారివారి రంగాలకు సంబంధించిన రంగాలపై పట్టు సాధించేందుకు ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శరవణకుమార్, అధ్యాపకులు డాక్టర్ వి.చంద్రశేఖరరావు, ఎస్.వరలక్ష్మి తదితరులు ప్రసంగించారు.

అవగాహనతోనే క్యాన్సర్‌ను ఎదుర్కోగలం



వైద్యులను సత్కరిస్తున్న నిర్వాహకులు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): క్యాన్సర్‌పై అవగాహన పెంచుకోవడం ద్వారానే క్యాన్సర్‌ను ఎదుర్కోగలమని క్యాన్సర్ వైద్య నిపుణురాలు చందన వేమూరి అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ జూబ్లీ ఆధ్వర్యంలో మొగల్రాజపురంలో క్యాన్సర్‌పై అవగాహన సదస్సు మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా చందన మాట్లాడుతూ క్యాన్సర్‌పై ఉన్న భయాలను వీడి అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవాలని చెప్పారు. లయన్స్ ఇంటర్నేషనల్ (జిల్లా-316డీ) గవర్నర్ వీవీపీఎస్.ఆంజనేయులు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ మానసిక ఆరోగ్యం, క్యాన్సర్‌పై అవగాహనకు ఇలాంటి సదస్సులు చాలా దోహదం చేస్తాయన్నారు. లయన్స్ ఇంటర్నేషనల్ సెకండ్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాసరెడ్డి, లయన్స్ ఇంటర్నేషనల్ పాస్ట్ జిల్లా గవర్నర్ మిరియాల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అవగాహనా ద్వారానే క్యాన్సర్ నుంచి తప్పించుకోగలమన్నారు. మానసిక వైద్యులు ఆక్కే అయోధ్య, బి.అనిత మానసిక ఆరోగ్యం అంశంపై మాట్లాడారు. లయన్స్ సభ్యులు యర్రంశెట్టి శ్రీనివాసరావు, బొబ్బా హరినాథ్ బాబుతో పాటు లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ జూబ్లీ అధ్యక్షుడు వి.మహేంద్రరెడ్డి, కార్యదర్శి కొత్తా శివ, కోశాధికారి తిరుపతి విజయ్‌కుమార్, లయన్స్ ప్రోగ్రామ్ కమిటీ ఛైర్‌పర్సన్లు తోటా నాగేశ్వరరావు, వేమూరి రవికుమార్ పాల్గొన్నారు. సదస్సు అనంతరం క్లబ్ సభ్యులు వైద్యులను సత్కరించారు.

మానసిక ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి



కోటిరెడ్డి, అక్కయ్యనాయుడుతో సీఏలు, లయన్స్ సభ్యులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఉరుకులు, పరుగుల జీవన విధానంలో కార్పొరేట్ రంగం ఉద్యోగులు మానసిక ఆరోగ్యంపై దృష్టి సారించాలని లయన్స్ జిల్లా పూర్వ గవర్నర్, ఉపన్యాసకులు అన్నపురెడ్డి కోటిరెడ్డి అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య అవగాహనా వారోత్సవాలను పురస్కరించుకుని గవర్నర్‌పేటలోని సురేష్‌బాబు చార్టర్డ్ అకౌంటెంట్స్ కార్యాలయంలో కార్పొరేట్ రంగం - ఉద్యోగుల్లో మానసిక ఆరోగ్యం అనే అంశంపై సదస్సు జరిగింది. లయన్స్ జిల్లా క్యాబినెట్ కోశాధికారి సీఏ సుంకర అక్కయ్యనాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కోటిరెడ్డి మాట్లాడుతూ వృత్తిపరమైన ఉత్పాదకతకు, జీవితంలో సంతృప్తికి మానసిక ఆరోగ్యం ఎంతో అవసరమన్నారు. నేటి సమాజంలో భావోద్వేగ భాగస్వామ్యం పెంపొందించుకోవాల్సిన ఆవశ్యకతను తెలియజేశారు. కష్ట సమయాలను అధిగమించే మార్గాలను ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో మనస్తత్వవేత్త బావిశెట్టి రమేష్ ఇంటరాక్టివ్ సెషన్ కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, ఉద్యోగులకు సైకలాజికల్ పరీక్షలు నిర్వహించి వారి ఆలోచనా విధానం, వ్యక్తిత్వాన్ని విశ్లేషించారు. సంతోషకరమైన జీవితాన్ని గడపడానికి పాటించాల్సిన మార్గాలు, వ్యూహాలను వ్యక్తిగతంగా సూచించారు.

అసోసియేషన్ ఎన్నికల్లో ఫఖర్ అహ్మద్ ఘన విజయం

ఆటోనగర్(విజయవాడతూర్పు): విజయవాడ టైర్ రీ ట్రేడర్స్ అండ్ వల్కనైజర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికల్లో వజ్రం గుర్తు అభ్యర్థి ఎస్కే ఫఖర్ అహ్మద్(100 ఎఫ్‌టీ బాబు) ఘన విజయం సాధించారు. మంగళవారం జరిగిన ఎన్నికల్లో తన సమీప(గడియారం గుర్తు) అభ్యర్థి సుభానిపై 218 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. అహ్మద్‌కు 809 ఓట్లు రాగా.. సుభానికి 591 వచ్చినట్లు ఎన్నికల అధికారి సుభాని తెలిపారు. ఈ సందర్భంగా ఫఖర్ అహ్మద్ మాట్లాడుతూ అసోసియేషన్ అభివృద్ధితో పాటు సభ్యుల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఫఖర్ అహమద్‌ను టైర్స్ అధినేత బాజీషరీఫ్, కలాం బ్యాటరీ వర్క్స్ అధినేత డాక్టర్ అబ్దుల్ కలాం, గౌస్‌ఖాన్, నూర్, ఖాదిర్‌తో పాటు ముస్లిం నాయకులు అభినందించారు. అనంతరం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు.

సీజేపై దాడిని ఖండిస్తూ న్యాయవాదులు విధుల బహిష్కరణ



నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

విజయవాడలీగల్: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై జరిగిన అనాగరిక దాడిని ఖండిస్తూ కృష్ణాజిల్లా బార్ ఫెడరేషన్ పిలుపుమేరకు బెజవాడ బార్ అధ్యక్షులు ఏకే బాషా మంగళవారం విజయవాడ కోర్టు కాంప్లెక్స్‌లోని అన్ని న్యాయస్థానాల న్యాయవాదులు విధులు బహిష్కరించారు. అత్యున్నత న్యాయస్థానంపై దాడి అంటే దేశం పైన దాడే అని బాషా అన్నారు. అనంతరం న్యాయవాదులందరూ నిరసన ప్రదర్శన చేపట్టారు. కోర్టు నుంచి బీసెంట్ రోడ్డు మీదుగా అంబేడ్కర్ స్మృతివనం వరకు ర్యాలీ చేశారు. 'సేవ్ జ్యూడిషరీ-సేవ్ నేషన్' నినాదాలతో ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏకే బాషా మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయిపై జరిగిన దాడిని ఖండిస్తూ, న్యాయస్థానాల మీద దాడి అంటే భారత రాజ్యాంగంపైన దాడిగా అభివర్ణించారు. అత్యున్నత న్యాయస్థానంలోనే ఇలా జరిగితే, న్యాయవాదులకు రక్షణ ఎక్కడ ఉంటుందని ప్రశ్నించారు. ఇటువంటి హీనమైన చర్యలను ఇక ముందు జరగకుండా ప్రభుత్వమే తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత..
నిరసన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు. మహిళా న్యాయవాది నరహరిశెట్టి జ్యోతి మాట్లాడుతూ.. భారతదేశ సీజేకి రక్షణ కల్పించలేని ఈ ప్రభుత్వం మహిళా న్యాయవాదులకు చట్టాన్ని కాపాడే ధైర్యం ఎలా ఇవ్వగలదని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఏపీ బార్ కౌన్సిల్ మెంబర్లు చలసాని అజయ్‌కుమార్, సుంకర రాజేంద్రప్రసాద్, మాజీ అధ్యక్షులు మట్ట జయకర్, సంపర దుర్గా శ్రీనివాస్, మాజీ కార్యదర్శి రాజా, గవర్నింగ్ బాడీ సభ్యులు, పెద్ద సంఖ్యలో సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు. అనంతరం ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశకు దాడిపై తగు చర్యలు తీసుకునే విధంగా ప్రభుత్వానికి సూచనలు చేయాలని వినతిపత్రం అందజేశారు.

నేత్రపర్వంగా వెంకన్నకు గరుడసేవ



స్వామివారి ఉత్సవమూర్తులకు తిరుమంజనం



గరుడవాహనంపై కొలువుదీరిన స్వామివారు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పౌర్ణమిని పురస్కరించుకొని వెంకన్న స్వామికి గరుడ సేవ ఉత్సవాన్ని మంగళవారం రాత్రి నేత్రపర్వంగా నిర్వహించారు. పాతబస్తీలోని పురాతన ఆలయమైన శ్రీవెంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో మాస పౌర్ణమి నేపథ్యంలో గరుడ సేవ చేశారు. ఈ సందర్భంగా స్వామి వారికి పలు ప్రత్యేక వైదిక కార్యక్రమాలను శాస్త్రోక్తంగా జరిపారు. ప్రతి నెల పౌర్ణమి రోజున స్వామి వారికి గరు వాహన సేవను నిర్వహించడ ఆనవాయితీ. అందులో భాగంగా గరుడవాహనంపై వెంకటేశ్వరస్వామి వారి ఉత్సవమూర్తులను అధిష్ఠింపజేశారు. సహస్రనామార్చనలు చేశారు. భక్తుల గోవింద నామాలు, మంగళవాయిద్యాలు, పండితుల వేదపఠనం, కళాకారుల నృత్యాలతో స్వామి వారి గరుడ ఉత్సవం నేత్రపర్వంగా ముందుకు సాగింది. ఈ సందర్భంగా భక్తులు స్వామివారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు.

శాస్త్రోక్తంగా తిరుమంజనం..
ఆలయంలోని స్వామి వారి ఉత్సవమూర్తులకు ప్రత్యేకంగా మంగళవారం తిరుమంజనం అభిషేకాలను నిర్వహించారు. పౌర్ణమిని పురస్కరించుకొని సుగంధ ద్రవ్యాలు, ఫలపుష్పాది రసాలతో స్వామి వారిని అభిషేకించి ప్రత్యేక వైదిక కార్యక్రమాలను శాస్త్రోక్తంగా చేశారు. వైదిక కార్యక్రమాలను ఆలయ పొన్నంగిపల్లి శ్రీరామచంద్రమూర్తి, దీక్షిత్‌లు నిర్వహించగా ఆలయ కార్యనిర్వహణాధికారి పర్యవేక్షించారు.